క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కారెంపూడి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని కట్టేల అడితీల సెంటర్‌లో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మ చలివేంద్రం శుక్రవారంతో వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా ఇక్కడ మినరల్ వాటర్ ధర్మ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అంతే కాక శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి సందర్భంగా కూడా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

గురజాల: మండల పరిధిలోని గంగవరం గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కోఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7లోగా వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేసుకోండి



మాచర్ల: సాధారణ మరణం, ప్రమాదవశాత్తూ మరణిస్తే వైఎస్సార్ బీమా మిత్ర కింద దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7వ తేదీలోగా అవకాశముందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, సచివాలయ పరిధిలోని ఆయా వలంటీర్లను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు కోరారు. శుక్రవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు వివరాలను సచివాలయ అడ్మిన్‌కు అందించి బీమా సౌకర్యాన్ని పొందాలన్నారు.

నేడు చుక్కల భూముల పట్టాల పంపిణీ

క్రోసూరు: చుక్కల భూముల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని చెప్పారు.

గిరిజనేతరులను

ఎస్టీల్లో చేర్చవద్దు

నకరికల్లు: గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేరిస్తే అసలైన ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని గిరిజన రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.కోటానాయక్ అన్నారు. జూన్ 4వ తేదీన నరసరావుపేటలోని సీపీఐ హాలులో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతు, ఒరియ తదితర గిరిజనేతరులను ఎస్టీల్లో చేర్చవద్దన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్టీలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే కొత్తవారిని ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పెదకూరపాడు: మండలంలోని గారపాడు బీసీ కాలనీ శివారులో పేకాటాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. ముందస్తు సమాచారంతో ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేయగా పది మందిని పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.5,150, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధులకు వైద్యసేవలు

సత్తెనపల్లి: కంటి సమస్యలపై అవగాహన అవసరమని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవ్వా తాతలకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు మూడో దశలో భాగంగా సత్తెనపల్లి మండలం కంటిపూడి గ్రామంలో శుక్రవారం నేత్ర స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ యు.శ్రీలక్ష్మీకవిత, ఆప్తమాలిక అసిస్టెంట్స్ సిహెచ్.మధు, ఎం.పావని, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు ఉన్నారు.

ఆయుర్వేదం.. ఆయుష్ మంత్ర

ప్రాచీన వైద్యం.. ఆయుర్వేదం.. మారుతున్న కాలంతో సంప్రదాయ వైద్యానికి ప్రజలు దూరమయ్యారు. వేగవంతమైన జీవనంలో అల్లోపతి వైద్యం వైపు చూస్తున్నారు.. ఇటీవల వ్యాధులు పెరగడం.. వైద్యం ఖరీదు కావడంతో ప్రత్యామ్నాయం ఆలోచన చేస్తున్నారు.. ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. దీంతో ఆయుర్వేదానికి ఆదరణ పెరుగుతోంది.

- వైద్య సేవలు ఘనం
- దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

పిడుగురాళ్ల: వైద్యశాల పట్టణంలోని మారుమూల కాలనీలో ఆయుర్వేద వైద్యశాల నిర్వహిస్తున్నారు. రోజుకి సుమారు 50 మంది రోగులు సేవలు పొందుతున్నారు. పట్టణంలోని 12వ వార్డులో 1984లో కమ్యూనిటీ హాల్ కోసం నిర్మించిన గది నిరుపయోగంగా ఉండటంతో ఇందులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను నిర్వహిస్తున్నారు.

ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు...

పట్టణంలో అధిక శాతం మంది పేదలతో పాటు సున్నం బట్టీల్లో పనిచేసే కార్మికులు ఉన్నారు. వివిధ రోగాల బారిన పడుతుంటారు. అనేక మంది పేదలు దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు. అందుకు ప్రధానంగా క్వారీల్లో పనిచేస్తుండడంగా నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదంపై ఆసక్తి పెరగడంతో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

సేవలు ఇలా..

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పంచకర్మ ట్రీట్‌మెంట్, చర్మ సంబంధిత వ్యాధులు, రోమటైటిస్ ఆర్థరైటిస్, సోరియాసిస్, ఏవీఎన్(తొంటి), వెన్ను ఎముక సమస్యలు, పక్షవాతం, ముఖ పక్షవాతం, స్త్రీ సంబంధిత సమస్యలు, ఆస్తమా, థైరాయిడ్ వాటితోపాటు దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యసేవలను అందిస్తున్నారు. నెలకు సుమారు 1200 మంది వైద్యసేవలు పొందుతున్నారు.



పిడుగురాళ్ల పట్టణంలోని ఆయుర్వే వైద్యశాల

ప్రజలు వినియోగించుకోవాలి



పిడుగురాళ్ల ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాలలో రోగులు పెరుగుతున్నారు. వైద్యసేవలను ప్రతి ఒక్కరికి అందిస్తున్నాం. ఇప్పుడు ఉన్న వైద్యశాల చిన్నదిగా ఉంది. అందుకే ఉన్నతాధికారులకు నూతన భవనం కోసం కృషి చేస్తున్నాం. ఇటీవలే మున్సిపల్ అధికారులకు కూడా నూతన భవనం కోసం దరఖాస్తు చేయటం జరిగింది.

– డాక్టర్ కె.మేఘమాల, ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యురాలు, పిడుగురాళ్ల

ప్రభుత్వ పథకాలతో కళాకారులకు ప్రయోజనం

మాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కళాకారులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని జాతీయ కళాకారుల సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు తెలిపారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో కళాకారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులను గుర్తించి కళాకారులకు న్యాయం చేయటం సంతోషంగా ఉందన్నారు. పేద కళాకారులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ప్రత్యేకంగా మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సాంస్కృతిక కళాకారులకు ఇబ్బందులు లేకుండా ప్రోగ్రాంలు చేసుకునేలా పూర్తి స్థాయి అనుమతులు ఇప్పించాలన్నారు. నాటకాలకు పూర్తి అనుమతులు ఇవ్వటం సంతోషకరమన్నారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారులుగా ఉత్తమ ప్రతిభ చూపి, కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న అబ్బూరి సుధాకర్ చౌదరి, దేవిలను సత్కరించారు. కార్యక్రమంలో దుర్గెంపూడి రామకోటిరెడ్డి, గుత్తికొండ ప్రభాకర్, తుమ్మల చెరువు అంకారావు, రమావత్ మాంగూబాయి, కంభంపాటి దానం, రాయపాటి జయమ్మ, కడియం సత్తమ్మ, పెరుమాళ్ళ వరలక్ష్మి, గుండెబోయిన రమణమ్మ, తిరుపతినాయక్ పాల్గొన్నారు.



కళాకారిణి దేవిని సన్మానిస్తున్న కళాకారులు

ఏటీఎం ధ్వంసం కేసులో నిందితుడి అరెస్ట్



నకరికల్లు: ఏటీఎం ధ్వంసం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నకరికల్లులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇండియా- 1 ఏటీఎం ఉంది. మే 23, అర్ధరాత్రి స్థానిక ఎన్నెస్పీ కాలనీకి చెందిన అల్లం శివకృష్ణారెడ్డి, తన ఏటీఎం కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. డబ్బులు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లాడు. మరో 20 నిమిషాల వ్యవధిలోనే దుస్తులు మార్చుకొని వచ్చి గడ్డపలుగుతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేశాడు. నగదు రాకపోవడంతో శాటిలైట్ పరికరాన్ని ఎత్తుకెళ్లాడు. ఎస్ఐ పి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని నకరికల్లులోని ఎన్నెస్పీ కాలనీలో అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి

ఎంపీడీఓ కోటేశ్వరరావు

మాచర్ల రూరల్: గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించటంతో పాటు రానున్న వ్యవసాయ అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలలో వారికి విత్తనాలు, ఎరువులు అందే విధంగా అధికారులందరూ సమష్టిగా పనిచేయాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల ద్వారా పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచి, అలాగే రైతు భరోసా కేంద్రాలలో రైతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సక్రమంగా సకాలంలో అందేలా కార్యదర్శులు, రైతు భరోసా, సచివాలయ సిబ్బంది పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు, కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకట్రామయ్య, ఐ.శ్రీనివాసరావు, టీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

ఉపాధిహామీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ముప్పాళ్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామాల్లో బాధ్యతగా పనిచేయాలని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2022- 23 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. పలు కారణాలతో మండలంలో మొత్తం 1368 జాబ్‌కార్డులు తొలగిస్తే కేవలం 13 కార్డులు మాత్రమే మరలా పునరుద్ధరించారని, మిగిలిన వారికి ఎందుకు జాబ్‌కార్డులు ఇవ్వలేకపోయారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ నెలాఖరు కల్లా పోయిన కార్డులన్నీ మరలా అందుబాటులోకి తెచ్చి వారందరికీ పని కల్పించాలని లేకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక గ్రామంలో కేవలం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కూడా పని కల్పించలేక పోతుండటాన్ని గమనించినట్లు వేదిక దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి గ్రామంలోను ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద రోజులు పనిదినాలు కల్పించేలా ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పనిచేయాలన్నారు. రికార్డుల నిర్వహణలో బాధ్యత లేకుండా పనిచేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఓ రామారావు, టీఏ శ్రీకాంత్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.26,807 రికవరీ...

మండలంలో2022-23 ఆర్థిక సంవత్సరం కు గాను మొత్తం 694 పనులకు గాను రూ.4కోట్ల55లక్షల65 వేల463 నిధులు ఖర్చు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో వెల్లడించారు. మస్టర్‌లలో తేడాలున్నట్లుగా గుర్తించారు, సంతకాలు లేకుండా పనికి వచ్చినట్లుగా వారి ఖాతాల్లో కూలీ జమచేయటం, మస్టర్ జాబితాలో పేర్లు యాడ్ చేయటం వంటి అవకతవకలను గుర్తించినట్లు ప్రజావేదికలో వెల్లడించారు. మొత్తం 26,807 అక్రమాలు జరిగినట్లుగా గుర్తించారు. వాటన్నింటినీ సంబంధిత సిబ్బంది వద్ద నుంచి రికవరీ చేయాలని పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. వీటితో పాటుగా రూ.29,877 లకు సంబంధించి జరిగిన పనులపై ఏపీడీ విచారణ జరిపి నివేదిక అందించాలని చెప్పారు.

చాగంటివారిపాలెంలో పనులపై విచారణ...

చాగంటివారిపాలెంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ పనులలో అక్రమాలు జరిగాయని గ్రామస్తులు ప్రజావేదిక వద్ద పీడీ జోసఫ్‌కుమార్ దృష్టికి తెచ్చారు. పనులు చేయకుండానే వారి ఖాతాల్లో కూలీ డబ్బులు జమ చేసి సుమారు రూ.10లక్షల వరకు అక్రమాలకు పాల్పడ్డారని, పది రోజుల క్రితం విచారణ జరపాలంటూ ఎంపీడీఓకి అర్జీ అందించినా స్పందించటం లేదని వారు పీడీ దృష్టికి తెచ్చారు. అక్రమాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారణ జరిపిస్తామని పీడీ గ్రామస్తులకు తెలిపారు. గ్రామంలో జరిగిన పనులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని ఏపీడీ వెంకటనారాయణను ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా విజిలెన్స్ అధికారి టీవీ విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ బాబూరావు, ఎస్సార్పీ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి పాల్గొన్నారు.



ముప్పాళ్లలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నకరికల్లు: సీజనల్ వ్యాధులపై గ్రామీణ వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. నరసరావుపేటలోని శ్రీకేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు షేక్ బాజి, కార్యదర్శి సైదా, కేసరి నర్సింహారెడ్డి, బాపతు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో మలేరియా దూరం

రెంటచింతల: నివాస పరిసర ప్రాంతాలలో దోమల నియంత్రణతోనే మలేరియాను దూరం చేయవచ్చునని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకుడు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. జూన్ ఒకటి నుంచి 30 వరకు నిర్వహించనున్న మలేరియా మాసోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. దోమల కారణంగా ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ జ్వరం, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా దోమ తెరలను, కిటికీలకు మెష్‌లను వాడాలని సూచించారు. ప్రతి శుక్రవారాన్ని కచ్చితంగా డ్రైడేగా పాటించాలని చెప్పారు. జ్వరం వచ్చినప్పుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకోవాల న్నారు. ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పూజల నాగేశ్వరరావు, సూపర్ వైజర్‌లు లక్ష్మి, ప్రసన్న, ఆరోగ్య కార్యకర్తలు, సీతారామిరెడ్డి, ఖాసిం పాల్గొన్నారు.



ర్యాలీని నిర్వహిస్తున్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, మలేరియా అధికారులు

రెవెన్యూ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

తహసీల్దార్ రమేష్ కుమార్

మాచర్ల రూరల్: నీటి తీరువా పన్ను, హైవే సర్వే, అసైన్డ్ భూములు, వీటితో పాటు ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పూర్తి చేయాలని లేకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ జి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని భూములకు వీఆర్‌ఓలు నీటి తీరువా సక్రమంగా వసూలు చేయాలని, హైవే పనులను పూర్తి చేసేందుకు సర్వే రికార్డులను సంబంధిత అధికారులకు సకాలంలో అందించాలని సూచించారు. అలాగే భూమి లేని నిరుపేదలకు అందించే అసైన్డ్ భూముల వివరాలను, వివిధ రైతుల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పూర్తి చేసి తగు సమాధానాన్ని అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, సర్వేయర్ జి.వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓలు ఆరుముళ్ల నాగేశ్వరరావు, హుసేన్, అనిల్, మూర్తి, రవికుమార్, జీరయ్య పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్ కుమార్

వృత్తి నైపుణ్యాల పెంపుదలకు శిక్షణ దోహదం

మాచర్ల: రాష్ట్రంలో సత్యసాయి సేవా సంస్థతో కలసి గ్రామీణ ప్రాంత బ్యాంకర్లు, హైదరాబాద్‌తో కలసి పలు చోట్ల మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ ఉచిత వృత్తి విద్య శిక్షణ కార్యక్రమం నిర్వహించటం ఆనందంగా ఉందని సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పి.సంధ్యారాణి అన్నారు. భగవాన్ సత్యసాయిబాబా సేవా సంస్థలు, బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సొసైటీ కాలనీలోని సాయి సమాజ సేవా కేంద్రంలో శుక్రవారం ఉచిత టైలరింగ్ ఫ్యాషన్ డిజైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవా సంస్థ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.సురేందర్ మాట్లాడుతూ వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో తమ సంస్థ సత్యసాయి సేవా కేంద్రం ద్వారా పలువురికి వృత్తి విద్యా శిక్షణనిచ్చి అనంతరం చేయూతనివ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రధాన బ్యాంకు మేనేజర్ ఎస్.కృష్ణారెడ్డి, కెనరా బ్యాంకు మేనేజర్ కె.లక్ష్మీకాంత్‌రెడ్డి, సంస్థ డిస్ట్రిక్ట్ అధ్యక్షులు ఉమామాధవ్, పి.విశ్వభారతి, కార్యదర్శి అక్కినేని అనిల్‌కుమార్, నిర్వాహకులు జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



శిక్షణ పొందుతున్న మహిళలతో అతిథులు

'ఫ్యామిలీ డాక్టర్' వైద్య సేవలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో వైద్యాధికారి సాయి తేజారెడ్డి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 124 మందికి పరీక్షలు చేయగా జనరల్ ఓపీ 15 మంది, హైపర్ టెన్షన్ 43 మంది, డయాబెటిస్ 21 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటిస్ 37 మంది, గర్భిణులు ఆరుగురు, బాలింతలు ఇద్దరు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పెండెం మణిరావు, ఎంఎల్‌హెచ్‌పీ డి.తిరుములవేణి, ఏఎన్ఎం షేక్ మస్తాన్‌బీ, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఈఓ ఇజ్రాయిల్ ఉన్నారు.

కోడెల శివరామ్‌కు టీడీపీ నేతల బుజ్జగింపు

సత్తెనపల్లి: మాజీ స్పీకర్ దివంగత కోడెల శివప్రసాదరావు తనయుడు కోడెల శివరామ్‌ను బుజ్జగించేందుకు జిల్లా టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. సత్తెనపల్లిలోని కోడెల శివరామ్ కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, కొండేపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి శుక్రవారం చర్చించారు. సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ పేరును అధిష్టానం ప్రకటించడంతో కోడెల శివరామ్ తిరుగుబాటు బావుట ఎగురవేసి అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ జిల్లా నాయకులు సుమారు రెండు గంటలపాటు శివరామ్‌తో ఏకాంతంగా సుదీర్ఘ చర్చలు జరిపారు. అయినప్పటికీ శివరామ్ ఏ మాత్రం వెనకడుగు వేయలేదని సమాచారం.

టెన్త్ ప్రతిభావంతులకు బహుమతులు

సత్తెనపల్లి: నియోజకవర్గ యాదవ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన యాదవ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు కన్వీనర్ టీ మదన్మోహన్‌రావు తెలిపారు. పట్టణంలోని నాగార్జున నగర్‌లోని యాదవ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు గుంటూరులోని బండ్లమూడి గార్డెన్స్‌లో గుంటూరు జిల్లా శ్రీకృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సుమారు పది లక్షల రూపాయలు బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. 500 పైన మార్కులు సాధించిన వారికి ఈ బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. వంద మందికి మూడు వేల రూపాయలు, ఆ తర్వాత 100 మందికి 2,000, ఆ తర్వాత వచ్చిన వారికి రూ.1000 నగదు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికి ఒక కళాశాల బ్యాగు, ప్రముఖ వక్తలతో ప్రేరణ క్లాసులు నిర్వహించ బడతాయన్నారు. సమావేశంలో నియోజక వర్గ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు లాకు పిచ్చయ్య, సాంబశివరావు, కిరణ్ కుమార్, జయరాం, రాధాకృష్ణ, రామకృష్ణ, ఉన్నారు.